www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 18 | నవంబర్ | 2025
పేజీలు : 8

## చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి



- దళారులను ఆశ్రయించి రైతులు నష్టపోవద్దు
-ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కూనంనేని

2 లో

# బడుగుల నివాసాలను కూల్చిన డోజర్లు

-సిపిఐ నాయకుల ముందస్తు అరెస్టు
-ప్రాధేయపడ్డ వదలని అధికారులు
-అశ్వారావుపేటలో ఉద్రిక్త వాతావరణం
-ప్రత్యామ్నాయం చూపే వరకు కదిలేది లేదు : పాషా





**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** బడుగులపై మరోసారి అధికార యంత్రాంగం తమ ప్రతాపాన్ని చూపింది. వందల ఎకరాలు కబ్జాకు గురవుతున్న పట్టించుకోని అధికార యంత్రాంగం నిరుపేదలు తలదాచుకునేందుకు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక నివాసాలపై ఐదు జేసిబిలతో దాడి చేసి నేలమట్టం చేశారు. ఆ ఉన్న కొద్ది సామానును బయట వేసుకునేందుకు కూడా అవకాశం ఇవ్వలేదు. కాళ్లా వేళ్లా ప్రాధేయపడిన కనికరించ లేదు. 200 మంది పోలీసులు ఒక యుద్ధ వాతావరణాన్ని తలపించే రీతిలో బడుగుల నివాసాలను కూల్చిన ఘటన సోమవారం తెల్లవారుజామున అశ్వారావుపేటలో జరిగింది. పేదల ఆర్తనాదాలు, ఆందోళనలతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. చంటి పిల్లలు, వృద్ధులు చలికి గజగజ వణికిపోయారు. అశ్వారావుపేటలోని 1228 సర్వే నెంబర్‌లో దాదాపు 250 మంది పేదలు గుడిసెలు వేసుకుని మూడేళ్లుగా జీవిస్తున్నారు. వీటిని కూల్చేందుకు అర్ధరాత్రి సమయంలో ఇండ్లలో నిద్రిస్తున్న సిపిఐ నాయకులను అరెస్టు చేసి దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు తరలించి ఆ తర్వాత జేసిబిలతో

మిగతా 2లో..

## పోలీసుల వైఫల్యమా..
# రాజకీయ ఒత్తిళ్లా..?

-రామారావు హత్య కేసులో దోషులెవరు...?
-సంచలనం సృష్టించిన సుఫారీ హత్య



**ప్రజాపక్షం/ఖమ్మం :** పోలీసుల వైఫల్యమో కానీ జిల్లాలో సంచలనం సృష్టించిన హత్య కేసు మిస్టరీ వీడ లేదు. 18 రోజులు గడిచినా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోకపోవడంతో పోలీస్ శాఖపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిపిఎం నాయకులు సామినేని రామారావును అక్టోబర్ 31న గుర్తు తెలియని వ్యక్తులు ఆయన ఇంట్లోనే కత్తులతో పొడిచి హత్య చేశారు. హత్య జరిగిన నాటి నుండి ఇది సుఫారీ హత్యేనన్న వాదన వినపడుతుంది. హత్య చేసింది ఎవరు...? హత్య చేయించింది ఎవరనే దానిపై ఇంత వరకు స్పష్టత లేదు. పాతర్లపాడు సర్పంచ్‌గా, రైతు సంఘం ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా పని చేసి ఉండటంతో రామారావుది రాజకీయ హత్యేనని సిపిఎం వాదిస్తుంది. 73 ఏళ్ల వయస్సున్న రామారావుకు ఆర్థిక పంచాయతీలు కానీ, హత్య చేయడానికి రాజకీయాలు తప్ప ఇతరత్రా కారణాలు లేవని సిపిఎం చెబుతుంది. మూమ్మాటికి ఇది రాజకీయ హత్యే అంటుంది. పోలీసులు 18 రోజులుగా హత్య కేసు నిందితులను గుర్తించక పోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుబాటులోకి వచ్చిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్నిఉపయోగించి నిందితులను గుర్తించే అవకాశం ఉన్నప్పటికీ నిందితుల విషయంలో ఎందుకు జాప్యం జరుగుతుందో అర్థం కావడం లేదు. ఖమ్మం జిల్లాలో సుఫారీ ఇచ్చి ఒక రాజకీయ నాయకున్ని హత్య చేయించడం ఇదే మొదటిసారి. గతంలో మండలంలో కిరాయి హంతకులు కాంగ్రెస్ నాయకున్ని హతమార్చిన ఘటన రెండు దశాబ్దాల క్రితం జరిగింది. ఆ తర్వాత మళ్లీ సుఫారీతో జరిగిన రాజకీయ హత్య రామారావుదే. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేసినప్పటికీ

మిగతా 2లో..

# ఎసిబికి చిక్కిన అధికారి

-లంచం తీసుకున్న వారితో పాటు ఇచ్చిన వారిని అదుపులోకి తీసుకున్న అధికారులు



**ప్రజాపక్షం/ఖమ్మం/ ఇల్లందు :** లంచం తీసుకోవడం అధికారులకు పట్టుబడటం ఆయనకు అలవాటైపోయింది. రేషన్ దుకాణాల పేరుతో అందిన మేరకు దోచుకుంటున్న ఓ అవినీతి తిమింగలం మరోసారి అవినీతి నిరోధక శాఖాధికారులకు పట్టుబడింది. గతంలో పట్టుబడిన కేసు విచారణ జరుగుతుండగానే మరోసారి సారూ అవినీతి అధికారులకు చిక్కారు. వివరాల్లోకి వెళితే... ఇల్లందులో పౌర సరఫరాల శాఖలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న మహ్మది యాకూబ్ పాషా తో పాటు అతని వద్ద పని చేస్తున్న మరో ఉద్యోగి విజయ్ వీరికి లంచం ఇవ్వడానికి వచ్చిన రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షున్ని అవినీతి నిరోధక శాఖాధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారం రోజుల క్రితం టేకితం మండలంలోని ఒక రేషన్ షాపును యాకూబ్ పాషా తనిఖీ చేశారు. ఉండాల్సిన దాని కంటే స్టాకు తక్కువగా ఉందని కేసు నమోదు చేశారు.

మిగతా 2లో..

# బడుగుల నివాసాలను కూల్చిన డోజర్లు







(మొదటిపేజీ తరువాయి)

పేదల నివాసాలను నేలమట్టం చేశారు. కాళ్లా వేళ్లా పడ్డ కనికరించ లేదు. కొంత మంది పేదలు అధిక వడ్డీలకు తెచ్చి రేకులు వేసుకుని జీవి స్తున్నారు. ఉన్న గూడు కాస్త కూలిపోవడంతో వారి వేదన వర్ణణాతీ తంగా ఉంది. తమకు ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయం చూపాలని పేదలు వేడుకుంటున్నారు.

### ప్రత్యామ్నాయం చూపే వరకు కదిలేది లేదు : పాషా

సిపిఐ ఆధ్వర్యంలో అశ్వారావుపేటలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వారి జీవితాలను అధికార యంత్రాంగం ఛిద్రం చేసిందని ప్రత్యామ్నాయం చూపే వరకు ఆ స్థలం నుంచి కదిలేది లేదని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా తేల్చి చెప్పారు. సోమవారం ధ్వంసమైన ఇండ్లను ఆయన పరిశీలించారు. పేదల గోడును విన్నారు. నిర్ధాక్షిణ్యంగా కూల్చివేయడాన్ని సాబీర్‌పాషా తీవ్రంగా ఖండించారు. ఈ కూల్చివేతకు జారే ఆదినారాయణ బాధ్యత వహించాలని సాబీర్‌పాషా తెలిపారు. ప్రజాప్రతినిధి అయి ఉండి పేదల పక్షాన ఆలోచన చేయకుండా పేదల గుడిసెలను కూల్చడం దుర్మార్గమన్నారు. అభివృద్ధికి కమ్యూనిస్టు పార్టీ అడ్డు కాదని కానీ యంగ్ ఇండియా స్కూల్‌కు కేటాయించిన భూమి 18 ఎకరాలు ఉందని పక్కనే ఓ భూస్వామి వందల ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించినా దానిని తీసుకోకుండా పేదలపై కక్ష కట్టారని పాషా తెలిపారు. మాఫియాను తలపించే రీతిలో వ్యవహరిస్తున్న స్థానిక తహసీల్దార్ రామకృష్ణ పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలు ఉండే స్థలమే యంగ్ ఇండియా స్కూల్‌కు అవసరమైతే పేదలకు ప్రత్యామ్నాయం చూపించి వారితో చర్చలు జరిపి భూమిని స్వాధీనం చేసుకుంటే మంచి దన్నారు. యంత్రాలను తీసుకువచ్చి పారా మిలటరీ ద్వారా ధ్వంసం చేయడం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పేదల విషయం తెలపడంతో పట్టాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని కానీ ఇంతలోనే స్థానిక అధికార యంత్రాంగం ఈ దారుణానికి ఒడిగట్టిందన్నారు. ప్రత్యామ్నాయ స్థలం చూపేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, సయ్యద్ సలీం, కె. వెంకటేశ్వరరావు, మండల నాయకులు గన్నిన రామకృష్ణ, వి. అర్జున రావు, విజయ్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేసే విధంగా అధికారులు ఏర్పాట్లు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా సహించేది లేదని కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని చాతకొండ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కొత్తగూడెం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన రైతు సభలో కూనంనేని మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు ఎటువంటి అలసత్వం వహించకుండా, నాణ్యతా ప్రమాణాలు పేరుతో రైతులకు ఇబ్బంది పెట్టకుండా, తరుగుపేరుతో కోతవిధించకుండా సత్వరమే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఏమైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని, తక్షణమేపరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ప్రధానంగా కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను తరలించడంలో ఆలస్యం జరగకుండా ఎప్పటికప్పుడు మిల్లర్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు చెల్లించాల్సిన నగదును కూడా త్వరగా వారి వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. టార్బాలిన్లు, తూకాల పరికరాలు,



తగిన బస్తాలు కొరత లేకుండా జాగ్రత్త తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నూతన కేంద్రం ఏర్పాటుతో చాతకొండ పరిసర ప్రాంతాల రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు దూరం వెళ్లాల్సిన అవసరం తప్పిందని, దీనివల్ల వారికి సమయం, రావాణాఖర్చులు ఆదా అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మండే వీరహనుమంతరావు, ఉపాధ్యక్షులు కూచిపూడి జగన్, డైరెక్టర్ చంద్రగిరి శ్రీనివాసరావు, తహశిల్దార్ శిరీష, ఎంపిడిఓ రాకేష్, సివిల్ సప్లై డిటి మహేష్, విద్యుత్ శాఖ ఏఇ రాఘవయ్య హౌసింగ్ ఏఇ డేవిడ్, అర్‌ఐ శివకృష్ణ, సిపిఐ నాయకులు దీటి లక్ష్మీపతి, నూనావత్ గోవిందు, మంద గ్రాబ్రియేల్, కోడి లింగయ్య, పర్స లక్ష్మయ్య, మాధవరావు, మంకెన ప్రసాద్, క్రాంతి భూషణ్, ఏఇఓలు, రైతులు పాల్గొన్నారు.

# ప్రభావం చూపని తెలంగాణ జాగృతి కల్వకుంట్ల కవిత పర్యటన

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రాష్ట్రంలోమారుతున్న సమీకరణాల నేపథ్యంలో సోమవారం సత్తుపల్లి పట్టణంలో జాగృతి నాయకురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన పర్యటన పెద్ద ఎత్తున సోషల్ మీడియా లో చర్చకు దారి తీసినప్పటికీ, ప్రజల్లో మాత్రం ప్రభావాన్ని చూపలేదన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో సింగరేణి కార్మిక సంఘాలు, యువతతో సమావేశాలు, స్థానిక జాగృతి నేతలతో చర్చలు నిర్వహించినా పర్యటన మొత్తం మీద గణనీయమైన ఉద్వేగం, ఆకర్షణ, లేకుండా పర్యటన సాగిందని అంతేకాకుండా మునుపటి ఉత్సాహం కూడా కనిపించలేదని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. కవిత పర్యటనను నీరుగార్చిన ప్రధాన అంశాలలో మాజీ ముఖ్యమంత్రి కూతురు గా కావలసినంత చరిష్మా ఉన్నప్పటికీ పట్టణంలో పర్యటన చాలా మందికి తెలియకపోవడం జాగృతి నాయకుల సమన్వయ లోపం గా భావిస్తున్నారు. పర్యటన సందర్భంగా ముందస్తు ప్రణాళిక ఉన్నప్ప



టికీ టైముకు చేరుకోలేకపోవడం స్థానిక మీడియా కి సరైన సమాచారం ఇవ్వలేకపోవడం స్థానిక జాగృతి నాయకులు తక్కువ సంఖ్యలో హాజరు కావడం, అభిమానుల నుండి ఊహించిన స్పందన రాకపోవడం కూడా జాగృతి నాయకులను ఆందోళనకు గురిచేసింది.

# ఎసిబికి చిక్కిన అధికారి

(మొదటిపేజీ తరువాయి)

ఈ విషయమై మహిళా డీలర్ ఎంత ప్రాధేయపడ్డ పాషా పట్టించుకోలేదు. చివరకు ఇల్లందు మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులు శబరీష్ ద్వారా యాకూబ్ పాషాను సంప్రదించగా రూ. 30వేలు ఇస్తే ఎటువంటి కేసు లేకుండా తిరిగి రేషన్ దుకాణాన్ని నిర్వహించుకోవచ్చునని చెప్పడంతో శబరీష్ ద్వారా రూ. 30వేలను రేషన్ డీలర్ పంపించారు. శబరీష్ స్థానిక జగదాంబ సెంటర్‌లో టెక్నికల్ అసిస్టెంట్ విజయ్‌కు నగదు అందిస్తుండగా ఏసిబి అధికారులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో పౌర సరఫరాల అధికారి యాకూబ్ పాషా, టెక్నికల్ అసిస్టెంట్ విజయ్‌తో పాటు లంచం ఇచ్చేందుకు వచ్చిన శబరీష్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. యాకూబ్ పాషా గతంలో కొణిజర్లలో పని చేస్తున్నప్పుడు ఓ ఆర్‌ఎంపి వద్ద లంచం తీసుకుంటూ ఏసిబికి అధికారులకు చిక్కారు. ఇప్పటికి ఆ కేసు విచారణలోనే ఉంది. మరోసారి యాకూబ్ పాషా అధికారులకు పట్టుబడటం గమనార్హం. ఈ సందర్భంగా ఏసిబి డిఎస్‌పి రమేష్ మాట్లాడుతూ లంచం ఇచ్చినా తీసుకున్న నేరమేనన్నారు. ఎవరైనా లంచం అడిగితే వెంటనే తమను సంప్రదించాలని రమేష్ తెలిపారు. పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

## పోలీసుల వైఫల్యమా..

# రాజకీయ ఒత్తిళ్లా..?

(మొదటిపేజీ తరువాయి)

ఫలితం రాకపోవడం వెనక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ముఖ్యంగా అధికార పార్టీ ఒత్తిడి కారణంగానే పోలీస్ దర్యాప్తు ముందుకు సాగడం లేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇటీవల కాలంలో పోలీస్‌పై ఇంత పెద్ద ఎత్తున విమర్శలు రావడం ఇదే మొదటిసారి. పోలీస్ ఉన్నతాధికారులు ఇప్పటికీ ఇది రాజకీయ హత్య కాదన్న భావనలో ఉండగా సిపిఎం మాత్రం ముమ్మాటికి ఇది రాజకీయ హత్యేనని దర్యాప్తు పక్కదారి పడుతుందని ఆరోపిస్తుంది. ఫిర్యాదుదారు పేర్కొన్న వారిని కనీసం విచారణ చేయడం లేదని సిపిఎం ఆరోపిస్తుంది. ఇదిలా ఉండగా సిపిఎం దర్యాప్తులో జాప్యాన్ని నిరసిస్తూ హత్య కేసు నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పట్టింది. 19వ తేదీన కాంగ్రెస్ , బిజెపియేతర పక్షాలతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఆ తర్వాత నేరుగా పోలీస్ కార్యాలయాలను ముట్టడిస్తామని తెలిపింది. రామారావు హత్య కేసులో పోలీస్ దర్యాప్తులో జరుగుతున్న జాప్యానికి సంబంధించి అధికార పార్టీ నేతలు సైతం పెదవి విరుస్తున్నారు. ఈ హత్య ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజక వర్గ పరిధిలో జరగడం ఇది రాజకీయ హత్యేనన్న ప్రచార నేపథ్యంలో పోలీస్ దర్యాప్తు మరింత ముమ్మరం చేసి హత్య కేసు నిందితులను తేల్చాలని లేకపోతే ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీకి నష్టమన్న భావనలో కాంగ్రెస్ నేతలు ఉన్నారని ఆ పార్టీకి చెందిన ముఖ్యుడు ఒకరు తెలిపారు. ఏది ఏమైనా రామారావు హత్య కేసు వ్యవహారం ఓ కొలిక్కి రాకపోవడంతో అటు పోలీస్, ఇటు అధికార పార్టీ కూడా విమర్శలను ఎదుర్కొంటుంది.

# కన్నుల పండుగగా కార్తీక దీపోత్సవం

-తొలిసారి భారీ సెట్టింగ్ ఏర్పాటు -భారీగా తరలివచ్చిన మహిళలు





**ప్రజాపక్షం/వైరా:** వైరాలో కమ్మవారి కళ్యాణ మండపం నందు కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలిసారి వైరాలో ఏర్పాటు చేసిన కార్తీక దీపోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్తీక దీపోత్సవం కార్యక్రమంలో మున్సిపాలిటీతో మండలంలోని పలు గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి కార్తీక దీపాలను వెలిగించారు. దీపాలు వెలిగించడంతో దీపాల కాంతుల్లో విరజిల్లింది. కార్తీక దీపం సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్మజన సేవా సమితి అధ్యక్షులు కట్టా కృష్ణార్జున్‌రావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, మార్కెట్ చైర్మన్ గంగారావు, పారుపల్లి కృష్ణారావు, చింతనిప్పు మురళి, సూర్యదేవర శ్రీధర్, ఏనుగు హనుమంతరావు, చింతనిప్పు రాంబాబు, ఆత్మ డైరెక్టర్ జాలాది రామక్రిష్ణ, పోదిలి హరినాథ్, కర్నాటి హనుమంతరావు, కొల్లి రమేష్, చెరుకూరు కిరణ్, కట్టా నర్సింహారావు పాల్గొన్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



**-ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు**

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఖమ్మం అర్బన్ మండలం పుట్టకోటకు చెందిన భవాని, మరియమ్మ, మమత, రామకళ, శైలజ, మల్లేశ్వరి, లక్ష్మి లు తమకు డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మంలోని అబ్దుల్ కలాం ఆజాద్ స్వయం సహాయక సంఘం తరుపున నిర్వహిస్తున్న షాపు రెంట్ తగ్గించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ముదిగొండ మండలం వల్లభి గ్రామ యువత గ్రామంలో గ్రంథాలయం పరిశీలించి మూసి ఉంచిన బిడిసి సెంటర్ను ప్రారంభించి పోటీ పరీక్షలకు యువత సన్నద్ధమయ్యే విధంగా అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం కార్పోరేషన్ తొమ్మిదవ డివిజన్ కార్పొరేటర్ షేక్ జాన్బీ రోటరీ నగర్లో ఇండ్ల మధ్య ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ను తొలగించాలని దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్లు సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డివో సన్యాసయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై దృష్టి సారించాలి

**-అదనపు కలెక్టర్ డా॥ శ్రీజ**



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై మండల ప్రత్యేకాధికారులు దృష్టిసారించాలని అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై మండల ప్రత్యేకాధికారులు ప్రతి శుక్రవారం చేపట్టిన తనిఖీ సంబంధిత అంశాలపై అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లు సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ ప్రతి మండల పరిధిలో ఎఫ్ఆర్ చైల్డ్ రీడ్స్ కార్యక్రమ అమలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల నిర్వహణ, ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు మండల పరిధిలో కట్టుదిట్టంగా అమలు జరిగేవిధంగా ప్రత్యేకాధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. మండల పరిధిలో ప్రతిపాదించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని, పత్తి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన వసతులు ఉన్నాయో లేవో పరిశీలించాలన్నారు. నాణ్యమైన ధాన్యం కొనుగులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు జరిగేలా పర్యవేక్షణ ఉండాలని అదనపు కలెక్టర్ తెలిపారు. మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల్లో ఎఫ్ఆర్ చైల్డ్ రీడ్స్ కార్యక్రమ అమలు తీరును నిర్దిష్టంగా పరిశీలించాలన్నారు. విద్యా సంస్థలను తనిఖీ చేస్తూ అక్కడ పారిశుధ్య నిర్వహణ, భోజన నాణ్యత, పిల్లలకు అవసరమైన వసతుల కల్పన వంటి అంశాలను పరిశీలించి నివేదిక అందించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్డివో సన్యాసయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# డిసెంబరు 26న సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభ



**-ఊరూ వాడ కదిలి వచ్చి జయప్రదం చేయాలి**
**-సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు**

ప్రజాపక్షం/బోనకల్: డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభకు ఊరూ వాడ కదలి వచ్చి జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. మండలంలోని ముష్టికుంట్ల, ఆళ్లపాడు, మోటమర్రి గ్రామాల్లో శతాబ్ది ఉత్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం సోమవారం నిర్వహించారు. సిపిఐ వందేళ్ల చరిత్ర అంతా పేదలు, అణగారిన వర్గాల పక్షాన పోరాటాలు చేసిందన్నారు. ఓట్లు, సీట్లు కోసం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది సిపిఐ మాత్రమేనన్నారు. భారత స్వాతంత్రోద్యమం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, వేలాది ఎకరాల భూమి పేదలకు పంచడంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు. త్యాగధనుల స్ఫూర్తితో యువత కమ్యూనిస్టు పార్టీలలో చేరి గౌరవప్రదమైన రాజకీయాలు చేయాలని ఆకాంక్షించారు. నిరుపేదలకు ఇళ్ల, రేషన్కార్డులు, పింఛన్లు దక్కే వరకు పేదల పక్షాన నిలబడి విరోచిత పోరాటాలు నిర్వహించిన ఘన చరిత్ర సిపిఐ అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. శతాబ్ది ఉత్సవ ముగింపు సందర్భంగా ఖమ్మంలో 10 లక్షల మందితో నిర్వహించే సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సభకు 20 దేశాల పైగా ప్రతినిధులు, జాతీయ, ఆయా రాష్ట్రాల నాయకులు పాల్గొని ప్రసంగించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి బుర్రి నాగేశ్వరరావు, ఆకెన పవన్, వంగాల కృష్ణ, కొంగర భాస్కరరావు, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, బెజవాడ నరేష్, బుంగ నరసింహ పాల్గొన్నారు.

# ఉద్యోగుల ఆరోగ్యమే సంస్థ మనుగడకు మూలం

**జీఎం చింతల శ్రీనివాస్**






ప్రజాపక్షం/సత్తుపల్లి: ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ మనుగడ సాగిస్తుందన్నారు సింగరేణి జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్. సింగరేణి సి అండ్ ఎండి బలరాం మార్గ నిర్దేశంలో, జిఎం చింతల శ్రీనివాస్ ఆదేశాల మేరకు జలగం వెంగళరావు ఓపెన్ కాస్ట్ 2లో సోమవారం ప్రాచీన యోగ దినచర్య కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ సిహెచ్. శ్రీనివాస రావు హాజరై యోగా ఆసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ ఆరోగ్యంగా ఉంటేనే సంస్థలో రక్షణ, ఉత్పత్తి, ఉత్పాదకత బాగుంటుందని, ఉద్యోగుల ఆరోగ్యం కోసం ప్రాచీన యోగ దినచర్యను ఏర్పాటు చేయడమైనదన్నారు. ఈ కార్యక్రమంలో యోగ ట్రైనర్ షణ్ముఖ శివ చంద్ర ఉద్యోగులకు ఆరోగ్యం, పురాతన యోగ జీవనశైలి పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జేవిఆర్ ఓసి2 ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్ వి ఆర్ ప్రహ్లాద్, కిష్టారం ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ వర్మ, హెచ్ ఓడి, జేవిఆర్ సిహెచ్ పి కే. సోమశేఖర్, ప్రాజెక్ట్ ఇంజినీర్లు జెవిఆర్ ఓసీ, కిష్టారం ఓసీ డి. శ్రీనివాస రావు, జి. వెంకటేశ్వర రావు, బి. రాజేశ్వర రావు,జి కళ్యాణ్ రామ్, బి రామకృష్ణ, వెల్ఫేర్ ఆఫీసర్లు దార కావ్య, కె శ్రీనివాస్, ఐఎన్టియూసి నాయకులు నాగ ప్రకాశ్, ఏఐటియూ సి బ్రాంచ్ సెక్రటరీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ను సందర్శించిన అడిషనల్ డిసిపి



ప్రజాపక్షం/రఘునాథపాలెం: రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ను అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు సందర్శించారు. సోమవారం పోలీస్ స్టేషన్ను సందర్శించిన అడిషనల్ డిసిపి ప్రసాదరావు స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు, సిసిటి ఎన్ఎస్ అప్లోడ్, జనరల్ డైరీ రికార్డులను, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పిటిషన్ విచారణకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, డయల్ 100 కాల్స్, ప్రతి స్పందన సమయం, సస్పెక్ట్ షీట్లు, పెండింగ్ కేసులు పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ వాహన తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. స్టేషన్ హౌస్ మేనేజ్మెంట్, పోలీస్ స్టేషన్ నిర్వహణ, సెక్టార్ ఆఫీసర్ల బాధ్యతలు విధిగా అమలు చేయాలని సూచించారు. పెట్రో కార్, బీట్ డ్యూటీ సిబ్బంది ఏ విధమైన విధులు నిర్వహిస్తున్నారు, పాత నేరస్తుల నివాసాలను, కదలికలను ఏవిధంగా గుర్తిస్తున్నారు అడిషనల్ డిసిపి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ కేసుల్లోని వాహనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి, రఘునాథపాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద ప్రాంతం పరిశీలన



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : రఘునాథపాలెం మండలం ఈర్లపుడి వైకుంఠ ధామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద ప్రాంతాన్ని అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తితో సోమవారం సందర్శించారు. కొణిజర్ల మండలం ఉప్పలచెలకకు పత్తి తీసేందుకు కూలీ పనులకు వచ్చిన తిరుమలాయపాలెం చంద్రుతండా గ్రామానికి చెందిన ఎనిమిది మంది కూలీలు పనులు ముగించుకుని రెండు ఆటోలలో తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఈర్లపుడి వైకుంఠ ధామం వద్ద రోడ్డుపైకి గేదెలు అడ్డుగా రావడంతో ఆటోలు అదుపు తప్పి ప్రమాదానికి గురై పల్టీ కొట్టాయి. ఈ ప్రమాదంలో పలువురు కూలీలకు గాయాలు కాగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన బోడా నాగమ్మ మృతిచెందింది. రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని అడిషనల్ డిసిపి ప్రసాదరావు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ ఉస్మాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్నాకు తరలిన పెన్షనర్లు



ప్రజాపక్షం/ఖమ్మం : పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ఇందిరాపార్కులో జరిగిన మహా ధర్నాకు ఖమ్మం జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పెన్షనర్లు తరలి వెళ్లారు. ఖమ్మం పెన్షనర్ల కార్యాలయం నుంచి ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్ తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవి కుమార్ లు మాట్లాడుతూ పెన్షనర్ల ఆందోళన తీరు చూసైనా ప్రభుత్వం స్పందించాలన్నారు. తక్షణం పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని పుల్లయ్య, రవికుమార్ లు డిమాండ్ చేశారు. జిల్లా నుంచి హాజరైన ప్రముఖుల్లో మేరీ ఏసుపాదం, శరత్బాబు, భాస్కరాచారి, వెంకటేశ్వర్లు, అంజలి, వీరభద్రరావు, అన్నమ్మ తదితరులు ఉన్నారు.

# మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని ఎనిమిదవ డివిజన్ వైఎస్ఆర్ నగర్లో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల శిక్షణ ఇప్పించి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కాంగ్రెస్ నాయకులు బోడా శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం సర్టిఫికెట్లతో పాటు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ సహకారంతో మాతృశ్రీ మహిళా మండలి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 30 మంది మహిళలకు కుట్టు శిక్షణ అందించారు. బోడా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. బాలపేట, గోపాలపురం ప్రాంతాల్లో రెండవ విడతలో మహిళలకు శిక్షణ ఏర్పాటు చేసి కుట్టు మిషన్ నేర్పిస్తామన్నారు.శిక్షణ పూర్తి చేసిన వారికి కుట్టు మిషన్లు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

# శ్రీ నీలాద్రీశ్వరుణ్ణి దర్శించుకున్న జిల్లా జడ్జి అపర్ణ



ప్రజాపక్షం/పెనుబల్లి: పెనుబల్లి మండలం నీలాద్రి నందలి శ్రీ నీలాద్రిశ్వర స్వామి వారి దేవస్థానం నందు కార్తీక మాసం సోమవారం పురస్కరించుకుని జిల్లా జడ్జి అపర్ణ, సత్తుపల్లి పిపి రాజాగౌడ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని స్వామి వారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రజాపక్షం/బూర్గంపాడు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ బూర్గంపాడు పరిధిలో గల పిపిసి బూర్గంపాడు కొనుగోలు కేంద్రాన్ని సంఘం అధ్యక్షులు బిక్కసాని శ్రీనివాస రావు సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలోని విక్రయించి, ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు, సంఘం సెక్రటరీ, రైతులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## మిరప తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



ప్రజాపక్షం/కూసుమంచి: పాలేరు డివిజన్ పరిధిలో కూసుమంచి, తిరుమలయపాలెం మండలంలో బుధవారం శాస్త్రవేత్తలు మిరప పంటలను పరిశీలించారు. వివిధ గ్రామాలలో కూసుమంచి, రవిచేట్టు తండా, గంగబండ తండా, తాళల చెరువు, బీరోలులో మిరపలో వేరు కుళ్ళు, కొమ్మ కుళ్ళుతో దెబ్బ తిన్న తోటలను కృషి విజ్ఞాన కేంద్రం, వైరా నుండి శాస్త్రవేత్తలు పరిశీలించి తగు నివారణ చర్యలు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టి సుచరిత దేవి, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి చైతన్య, కీటక శాస్త్రవేత్త డాక్టర్ టి పావని, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త విజ్ఞాన కేంద్రం ఫణి శ్రీ, వైరా, పాలేరు ఉద్యాన అధికారి పి అపర్ణ, కూసుమంచి మండల వ్యవసాయ అధికారి ఆర్ వాణి, రైతులు కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, మంగత్య, కృష్ణ, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

## షరతులు లేకుండా పత్తి కొనుగోలు చేయాలి




ప్రజాపక్షం/జూలూరుపాడు: తేమ శాతంతో సంబంధం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే షరతులు లేకుండా పత్తి కొనుగోలు చేయాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది. సోమవారం సిపిఎం పార్టీ జూలూరుపాడు మండల కమిటీ సమావేశం సిపిఎం కార్యాలయంలో పార్టీ కమిటీ సభ్యులు గార్లపాటి వెంకటి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్షాల తీవ్రతతో పత్తి రైతులను అతలాకుతలమైందని, వర్షాల విపత్తులను తట్టుకొని రైతులు అంతా పత్తి పండిస్తే తీరా పత్తి అమ్మే సమయానికి తేమ శాతం పేరుతో కోతలు విధించి ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే తక్కువ రేట్లకు మధ్య దళారీలు కొనుగోలు చేస్తున్నారని ప్రభుత్వం నిర్ణయించిన ధరకు తేమ శాతం అనే నిబంధన లేకుండా సిసిఐ కార్పొరేషన్ వారే కొనుగోలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్, పార్టీ మండల కార్యదర్శి యాసా నరేష్, పార్టీ మండల కమిటీ సభ్యులు గడిదేసి కనకరత్నం, ధారావత్ రమేష్, తాటి పద్మ, ఒడల వెంకటేశ్వర్లు పార్టీ శాఖ కార్యదర్శులు బొల్లి లక్ష్మయ్య, తోలం సరస్వతి, బానోత్ రూప, బోడ అబిమిత్ర తదితరులు పాల్గొన్నారు.

## ఫకీరయ్యకు నివాళి



ప్రజాపక్షం/కారేపల్లి: అప్పాయిగూడెం పంచాయితీ భీక్యతండ గ్రామానికి చెందిన తోటమల్ల పకీరయ్య సోమవారం మృతి చెందారు. పకీరయ్య అమృతదేహానికి గిరిజన నాయకుడు అజ్మీర వీరన్న పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఫకీరయ్య గ్రామంలో చేసిన సేవలను గుర్తు చేశారు. నివాళులర్పించిన వారిలో భూక్యా శంకర్, వైద్యుడు చెవుల చందు, భానోత్ లక్ష్మణ్, భూక్యా రాంకీ, వాంకుడోత్ భావుసింగ్, గుగులోత్ మాల్సూర్, బాదవత్ దేవీలాల్, వాంకుడోత్ కిషోర్, జాటోత్ సంతోష్, బాదావత్ సురేష్, బానోత్ సాయి, తదితరులు ఉన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన కందాళ



ప్రజాపక్షం/కూసుమంచి: మండల పరిధిలోని చేగొమ్మ గ్రామంలో ఇటీవల కాలంలో మరణించిన వారి కుటుంబ సభ్యులను సోమవారం పాలేరు మాజీ ఎంఎల్ఏ కందాల ఉపేందర్‌రెడ్డి పరామర్శించి, ఓదార్చారు. గ్రామంలోని చిర్ర పెద్ద వెంకన్న, కసుమ ఉపేందర్ కుటుంబాలను పరామర్శించి మనోధైర్యం ఇచ్చారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ మండల మండల ప్రధాన కార్యదర్శి ఆసిఫ్ పాషా, జిల్లా నాయకులు మల్లీడి వెంకన్న, మాజీ ఎంపీటీసీ జార్పల బాలాజీ నాయక్, మాజీ సర్పంచ్ బానోత్ కిషన్ నాయక్, సోషల్ మీడియా అధ్యక్షులు వద్త్యా బాలకృష్ణ, గ్రామ శాఖ అధ్యక్షులు బొల్లికొండ శ్రీకాంత్, బొల్లికొండ వెంకన్న, వీరబాబు, దాసరి వెంకన్న, దమల కోటి, షణ్మాత్రరావు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మాకేది ఇందిరమ్మ ఇల్లు..!?

**-పేరుకే అధికారులు, ఇందిరమ్మ కమిటీలదే ఇష్టారాజ్యం**
**-భూములు, రాజకీయ అండ ఉన్నోళ్ళకే కేటాయింపులా..?**
**-అధికారులు, సర్కారు తీరుపై ప్రజలు అసహనం**







**పూరి గుడిసెల్లో ఉన్నా దక్కని ఇందిరమ్మ ఇల్లు... వాంకుడోతు కోమటి, కాలియా తండా.**

ప్రజాపక్షం/జూలూరుపాడు: పేదవారి సొంతింటి కలను నిజం చేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరుపేదలకు అందని ద్రాక్షాగానే మిగిలింది. పారదర్శకంగా జరగాల్సిన ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపిక పూర్తిగా రాజకీయ కోణంలో జరిగినట్లు. సిఫార్సులకే పెద్దపీట వేసినట్టు విమర్శలు వస్తున్నాయి. అధికారులు క్షేత్రస్థాయి సర్వేకు భిన్నంగా అర్హుల జాబితా రూపొందినట్లు ఆరోపణలు లేకపోలేదు. మొదటి విడత పైలెట్ ప్రాజెక్టులో భాగంగా కొంత వరకు అర్హులకే ఇళ్లు దక్కినప్పటికీ, ఐటీడీఏ కార్యాలయం నుండి జాబితా తయారీ పూర్తిగా ఎమ్మెల్యే అనుచరుల కనుసన్నల్లో పూర్తయిందని, ఇందిరమ్మ కమిటీలు సిఫార్సు చేసిన కార్యకర్తలు, ఓటర్లకే ఇళ్లను కట్టబెట్టినట్లు విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. అర్హులకు బదులు అనర్హులు వచ్చి చేరినట్లు సమాచారం. విషయం అధికారులకు తెలిసీ ఏమీ చేయలేక. నాయకులు, కమిటీ వారు సూచించిన పేర్లను లబ్ధిదారుల జాబితాలో చేర్చుతున్నట్టు తెలుస్తోంది. ఫలితంగా పేదల సొంతింటికల నెరవేరకుండా పోతోంది.

**ఇందిరమ్మ కమిటీల మితిమీరిన జోక్యం...**

ఇందిరమ్మ కమిటీల మితిమీరిన జోక్యంతో లబ్దిదారుల ఎంపికలో పారదర్శకత లోపిస్తోంది. మండల వ్యాప్తంగా రాజకీయ ప్రమేయం అధికమవుతోంది. గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెబుతున్న దానికి భిన్నంగా క్షేత్రస్థాయిలో ఎంపికలు జరుగుతున్నాయి. కఠిక పేదలు, నిరుపేదలు, పేదలు. ఇలా విడతలవారీగా ఎంపికలు ఉండాలని ఆయన సూచిస్తున్నారు. కానీ ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ఇష్టా అయిష్టాల ముందు అవేవీ పనిచేయటం లేదు. కమిటీలో సభ్యులకు నచ్చిన వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తూ నచ్చకపోతే దూరం పెడుతున్నారు. లబ్దిదారుల ఎంపికలో కులం, మతం, పార్టీలు చూడమని మంత్రి ప్రకటిస్తున్నా, అవేవీ ఆచరణకు నోచుకోవటం లేదు. మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మొదటి జాబితాలో ఇండ్లు మంజూరైనాయి. మరికొని ఇందిరమ్మ ఇళ్లు ఐటీడీఏ కార్యాలయం నుండి మండలవ్యాప్తంగా ఎస్టీ లకు మాత్రమే అనుమతి ఇచ్చారు. ఇందులోనూ ఇందిరమ్మ కమిటీల ఇష్టానుసారమే ఎంపిక జరిగిందని అర్హులైన నిరుపేద గిరిజనులకు ఇండ్లు మంజూరు కాలేదని. గ్రామ కార్యదర్శులు, ఎంపీడీవోలు సర్వే చేయాలి. కానీ ఈ ప్రక్రియలో రాజకీయ జోక్యం అధికమవుతుండటం అధికారులకు కూడా తలనొప్పిగా మారిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

పూరిగుడిసెలో ఉన్న వారికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి సర్కారులో పూరిగూడిసెలో ఉంటున్న నిరుపేదలైన కొంత మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకంటే ఉన్న వారికి, ఒక్కో ఇంట్లో రెండ్లు ఇండ్లు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వున్న వారికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని తాము పూరిగుడిసెలో బతుకుతున్న తమకు ఇందిరమ్మ ఇండ్లు రాలేదని గుండ్లరేవు, కొమ్ముగూడెం, నరసాపురం, గుండెపుడి, గాంధీనగర్ గ్రామాల నిరుపేదలు గిరిజనులు వాపోయారు. అధికారులను అడిగితే రెండోవిడతలో వస్తదని చెప్పారు. రెండో విడత ఇంకెప్పుడు వస్తుందో అని ఇందిరమ్మ ఇంటి కోసం వారు ఎదురు చూస్తున్నారు. తమ లాంటి వారికి సర్కారును నుంచి సాయమందిస్తే బాగుంటుందని మండల వ్యాప్తంగా నిరుపేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎన్నికలు వస్తే గుర్తుకు వస్తాం...**
**బానోత్ మధు, గుండెపుడి గ్రామస్తుడు.**

ఎన్నికలు ఒచ్చినప్పుడు ఓట్ల కోసం గుర్తుకు వచ్చే మేము మిగిలిన ప్రభుత్వ పథకాల సందర్భాలలో గుర్తుకురామా? పేదింటి కల కలగానే మిగిలిపోయింది. ఇండ్లు ఉన్నవారికే ఇందిరమ్మ ఇండ్లు, నిరుపేదలకు గుండు సున్నానా.? ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని, ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని, చెప్పి ఇప్పుడు పేద వారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకుండా నాయకులకు మరియు అనుచరులకు మాత్రమే ఇస్తున్నారు, పేదవారు ఎప్పుడు పేదవారి లాగానే ఉండాలా? ఎన్ని ప్రభుత్వాలు మారినా మా బతుకులు మాత్రం మారడం లేదు.

# జమలాపురం ఆలయంలో కవిత ప్రత్యేక పూజలు



ప్రజాపక్షం/ఎర్రుపాలెం : జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం ఆలయాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయంలో సాంప్రదాయం ప్రకారం అర్చకులు, ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం కవిత శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 2గంటల పాటు పైగా ఆమె ఆలయంలో గడిపారు. ఆలయ చరిత్ర, విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్చకులు ఆశ్వీరచనంతో పాటు శ్రీవారి చిత్రపటాన్ని, శేష వస్త్రాలను అందచేశారు. అనంతరం జాగృతి నాయకుడు మాజీ తెలంగాణ జాగృతి మండల అధ్యక్షులు కాపర్తి సతీష్ నివాసంలో అల్పాహారాన్ని స్వీకరించారు.

**ఏకో టూరిజం భూ నిర్వాసితులకు పరామర్శ...**

జమలాపురంలో నిర్మాణం జరుగుతున్న అర్బన్ పార్క్ ఏకో టూరిజం ప్రాజెక్టు భూ నిర్వాసితులను ఆమె పరిశీలించారు. ఏకో టూరిజం ప్రాజెక్టు ద్వారా తమ భూములను కోల్పోతున్నామని, ప్రత్యామ్నాయం చూపకుండా అటవీశాఖ అధికారులు భూములను లాక్కున్నారని రైతులు ఆమె ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చొరవ తీసుకు నేలా తమ వైపు పోరాడాలని కవితను నిర్వాసితులు అభ్యర్థించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడతానని భూములు కోల్పోయిన రైతులకు జాగృతి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రత్యామ్నాయమో, పరిహారమో వచ్చే వరకు జాగృతి 13మంది రైతుల తరుపున పోరాటం చేస్తుందన్నారు. ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నందున తీర్పు వచ్చే వరకు సంయమనం పాటించాలని ఆమె కోరారు. అదేవిధంగా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న వ్యక్తుల్ని దీర్ఘకాలం ఎవరూ రక్షించలేరని ఆమె ఘాటుగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, జిల్లా అధ్యక్షులు గుంటి సుందర్, కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు గట్టు కరుణ, జాగృతి రాష్ట్ర నాయకులు పవన్, ప్రతాప్‌నాయక్, నాయకులు బూసిపోగు సృజన్‌కుమార్, గద్దల సత్యనారాయణ, ఉయ్యూరు సాయిరాం, పోతురాజు గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# వందల్లో బట్టీలు.. నిబంధనలకు తూట్లు..!

**-మండలంలో కుప్పల తెప్పలుగా బట్టీల నిర్వహణ**
**-ప్రభుత్వ నిబంధనలు పట్టని బట్టీలు**





ప్రజాపక్షం/అశ్వాపురం: ఏ వ్యాపారమైన నిర్వహించాలంటే ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందే. కానీ అశ్వాపురం మండలంలో బట్టీలు నిర్వహిస్తున్న యజమానులకు మాత్రం ఈ నిబంధనలు పట్టవు. పర్యావరణ పరిరక్షణ, కార్మికుల భద్రత, నాణ్యత నియంత్రణ, చట్టపరమైన అనుమతులు అవసరం అవుతాయి.

**అసలు చట్టపరమైన అనుమతులు ఉన్నాయా....**

పర్యావరణ అనుమతి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నుండి పొందాలి. వ్యవసాయ భూమిని బట్టీ కోసం మార్చాలంటే స్థానిక అధికారుల అనుమతి అవసరం. లైసెన్స్ రిజిస్ట్రేషన్ స్థానిక పట్టణ గ్రామ పంచాయితీ లేదా మున్సిపాలిటీ నుండి నమోదు కావాలి. పర్యావరణ పరిరక్షణ నిబంధనలు బొగ్గు, బయోమాస్ లేదా అనుమతించబడిన ఇంధనాలనే ఉపయోగించాలి. ప్లాస్టిక్, రబ్బర్, వ్యర్థ పదార్థాలను కాల్చ కూడదు. చిమ్ని ఎత్తు సాధారణంగా 30 మీటర్ల కంటే ఎక్కువ ఉండాలి. నీటి వనరుల కలుషితం నివారించడం, మట్టి, బూడిద పక్కనే నీటి వనరులు ఉండకూడదు. చెట్లు నరికివేయకుండా మట్టి సేకరణ కార్మికుల సంక్షేమం, భద్రత వారికి మాస్కులు, హెల్మెట్, గ్లౌవ్స్, ఫ్యాక్టరీ యాక్ట్, కార్మిక చట్టాల అనుసరణ కనీస వేతనాలు చెల్లింపు పని చేసే గంటలు, విశ్రాంతి సమయం వసతి, శుభ్రత సౌకర్యాలు ఇవ్వడం అగ్ని ప్రమాద నియంత్రణ పరికరాలు వాడటం, వేడి సామర్థ్యం ఉష్ణోగ్రతలను గమనించడం, బట్టి నాణ్యత, నీటి మిశ్రమం సరిగ్గా కలపడం సరైన డ్రైయింగ్ యార్డు ఏర్పాటు చేయాలి. వర్షకాలంలో ఉత్పత్తి తగ్గించడం ధూమం, బూడిద, వేడి సరైన దిశలో విడుదల చేయడం భూమి వనరుల వినియోగ నిబంధనలు అనుమతులేని ప్రాంతాల్లో మైన్ లాంటి గుంతలు త్రవ్వకూడదు. తవ్విన గుంటలను తర్వాత భూసార పెంపు కోసం పునరుద్దరించాలని, పొగ, దుమ్ము తగ్గేందుకు కవర్లు ఉపయోగించాలి. ఇటుక నిల్వ ప్రాంతం నీరు నిల్వ కాకుండా చూసుకోవాలి. కానీ యజమానులు మొత్తానికి నిబంధనలకు విరుద్ధంగా బట్టీలు నిర్వహిస్తున్నారు.

**నిబంధనలకు తూట్లు...**

భూ పరిరక్షణ చట్టం 129/12లో పేర్కొన్నట్లుగా వ్యవసాయానికి పనికి రాని భూముల్లో మాత్రమే ఇటుక బట్టీల వ్యాపారం నిర్వహించాలి. కానీ గ్రామీణ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా పంటలు పండే భూముల్లో ఇటుకలు తయారు చేస్తున్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని అధికారులకు మామూళ్లు చెల్లించి అడ్డదారిల్లో బట్టీలు చెలామణి చేస్తున్నారు. రెవిన్యూ పరిధిలో నివాసముంటున్న కూలీలకు సరైన సంఖ్య ఉండదు. సరైన పత్రాలు ఉండవు. మండలంలో పలు గ్రామాల్లో నిర్వహించే ఇటుక బట్టీల వ్యాపారానికి స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు పంచాయితీ, విద్యుత్ శాఖ అధికారుల అండదండలు పుష్కలంగా ఉంటాయనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో ఇటుక బట్టీల వ్యాపార్థులకు మూడు పువ్వులు ఆరుకాయలు అన్నట్లుగా ఇటుక బట్టీల వ్యాపారం మండలంలో కొనసాగుతోందని స్థానికులు అంటున్నారు. చాలా చోట్ల ఇటుక బట్టీలో యథేచ్ఛగా విద్యుత్ చౌర్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విద్యుత్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతోనే ఈపరిస్థితి ఉంది. ఏది ఏమైనా ఎన్ని జరిగినా బట్టి యజమానులు ప్రభుత్వ నిబంధనలన్నింటికి తూట్లు పొడుస్తూ మామూళ్లతో అధికారులకు ముట్ట చెబుతూ వీరి వైపు రానికుండా చేస్తున్నారు. ఇప్పటికైనా అటవీ, రెవెన్యూ యంత్రాంగాలు యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల
# పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలి



ప్రజాపక్షం/కల్లూరు: మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ కార్మికుల వేతనాలు, బిల్లులు, కోడుగుడ్డు బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ ఎంఈఓ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు మాట్లాడుతూ గత సంవత్సరం నవంబర్ నుంచి ఏజెన్సీ కార్మికులకు చెల్లించాల్సిన వేతన బకాయిలు, బిల్లులు, కోడుగుడ్డు బిల్లులు వెంటనే చెల్లించాలని లేనిచో ఆందోళనలు ఉదృతం చేస్తామని తెలిపారు. బకాయిల భారంతో ఏజెన్సీ కార్మికులు ఇబ్బందులు పడుతూ ఇటు మధ్యాహ్నం భోజనం అటు కుటుంబాల భారం తో ఇబ్బందులు పడుతున్నామని ఈ సమయంలో సంవత్సరం కావస్తున్న బిల్లు బకాయలు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని తెలిపారు. అప్పు సప్పు తీసుకొచ్చి నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు కార్మికులు అందిస్తున్నారని ఈ సమయంలో సంవత్సరం నుంచి అందించాల్సిన వేతన బిల్లు బకాయిలు అందక ఏమి చేయాలో అర్థం కావట్లేదని కార్మికులు సందిగ్ధంలో లోఉన్నారు. ఈ సమయంలో ప్రభుత్వం సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని తీసుకొచ్చే ఆలోచనను విరమించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వేతనాలు 10,000 ఇస్తానన్న హామీని అమలు పరచాలని ఈ విధంగా ఈ వారంలో రోజుకో నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. తర్వాత పోస్ట్ కార్డు ఉద్యమంతో ముఖ్యమంత్రికి విన్నపాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఏఐటీయూసీ నాయకులు దామాల దయాకర్ రావు, జిల్లా మధ్యాహ్నం భోజనం వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు పాగా సత్యవతి, కోశాధికారి వెంకటలక్ష్మి , అప్పమ్మ, నాగలక్ష్మి , కళావతి, తదితరులు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంఈఓ నివేదితకు అందజేశారు.

# ధృవీకరణ పత్రాలు కోసం నానా తంటాలు..!



ప్రజాపక్షం/కల్లూరు: నూతన మున్సిపాలిటీ కల్లూరులో జనన, మరణ ధృవీకరణ పత్రాల కోసం ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతుండడంతో సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. 2025 మే 28న నూతన మున్సిపాలిటీగా కల్లూరు ఏర్పడింది. దానికన్నా ముందు మున్సిపాలిటీ పరిధిలో జననాలు, మరణాలు మున్సిపాలిటీ పరిధిలో జరిగిన సమాచారం మేజర్ గ్రామపంచాయతీ సమాచారం మున్సిపాలిటీలో అప్డేట్ కానందున లబ్ధిదారులు ఇబ్బందులు పడుతుండటంతో సోమవారం కల్లూరు లోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో డిఏఓ కరుణశ్రీ కి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై వెంటనే స్పందించి తగు చర్యలు నిమిత్తం తగు సమాచారం పూర్తిస్థాయిలో అందించాలని మున్సిపాలిటీ కమిషనర్ కు తెలియపరిచారు. గత ఆరు నెలలుగా సుమారుగా 200 ధ్రువీకరణ పత్రములు కోసం బాధితులు ఎదురుచూస్తున్నారని అత్యవసర సమయంగా ఉన్న విద్యార్థులు పరీక్షల సమయంలో ఉన్న వారు అత్యవసరంగా ఇబ్బందులు పడుతున్నారని ధ్రువీకరణ పత్రములు వెంటనే అందించి ఆదుకోవాలని ప్రజలు డివిజనల్ పరిపాలన అధికారి కరుణ శ్రీ ని సంబంధిత వ్యక్తులు కోట పుల్లారావు, సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావులు తో పాటు మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.

## సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయండి




ప్రజాపక్షం/బూర్గంపాడు: ఖమ్మంలో జరిగే సిపిఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు, అలవాట సీతారాంరెడ్డిలు అన్నారు. సోమవారం సిపిఐ మండల కార్యవర్గ సమావేశం సారపాక కాపర్తి భవన్‌లో పాండవుల బిక్షం అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశంలో వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాలను డిసెంబర్ 26న ఖమ్మం నగరంలో ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని, ఈ మహాసభకు కమ్యూనిస్టు పార్టీ జాతీయ నాయకులు, అంతర్జాతీయ నాయకులు సుమారు 40దేశాల నుండి ఈ మీటింగ్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. మండలం నుండి భారీగా కార్యకర్తలు కదలి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఎంతో మంది ప్రాణత్యాగాలు చేసి ఎరుపెక్కిన ఎర్రజెండా వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని 101 వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న శుభసందర్భంగా ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సబ్కా నాగేశ్వరరావు, నాయకులు బర్ల వెంకటేశ్వర్లు, సిద్దారపు సుబ్బారెడ్డి, తోకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కులగణన రెమ్యూనరేషన్ తక్షణమే చెల్లించాలి



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: కుల గణన రెమ్యూనరేషన్ తక్షణమే చెల్లించాలని టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు అన్నారు. సోమవారం ఆళ్లపల్లి మండల కేంద్రం పరిధిలో గల ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల ముత్తాపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వే నిర్వహించిన, ఎన్యూమరేటర్లకు, సూపర్వైజర్లకు నేటి వరకు అందని రెమ్యూనరేషన్ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కుల గణన కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావడానికి సంబంధిత ఉపాధ్యాయులు, సిబ్బంది ఎంతో శ్రమిస్తూ సమయాన్ని కేటాయించి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. అయితే ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందికి ఇవ్వవలసిన రెమ్యూనరేషన్ ఇప్పటికీ విడుదల కాకపోవడం తీవ్ర అసంతృప్తికి దారితీస్తోందన్నారు. కుల గణన విధులలో పాల్గొనడం వల్ల సిబ్బంది తమ వ్యక్తిగత సమయాన్ని, తరగతి పాఠ్యప్రణాళికను అదనపు పనులను పక్కపెట్టి ప్రభుత్వ ఆదేశాలు నిబద్ధతతో అమలు చేశారని, అయినప్పటికీ ఈ శ్రమకు సంబంధించిన పారితోషికం ఆలస్యమవ్వడం ఆర్థిక భారం, మానసిక ఒత్తిడిని కలిగిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రెమ్యూనరేషన్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమరం లాలయ్య, కల్తీ లక్ష్మీనారాయణ, కుంజ రామయ్య, బి రవి, చిన్న, శ్రీను, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

## టిప్పర్ ఢీకొని పాడి గేదెలు మృతి



ప్రజాపక్షం/చంద్రుగొండ: బొగ్గు టిప్పర్ ఢీకొని నాలుగు పాడి గేదెలు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. బాధిత రైతు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామానికి చెందిన కేళోత్ రాములు అనే పాడి రైతు గేదెలు ఆదివారం మేతకు అడివికి వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం తెల్లవారుజామున ఇంటికి వస్తుండగా గ్రామ శివారులోని జాతీయ రహదారిపై కొత్తగూడెం నుండి సత్తుపల్లి వైపునకు వెళ్తున్న బొగ్గు టిప్పర్ అతివేగంగా గేదెలను ఢీకొట్టడంతో నాలుగు మృతి చెందాయి. వీటి విలువ రూ 3.50లక్షల వరకు ఉంటుందని బాధిత రైతు రాములు వాపోయారు. టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే గేదెలు మృతి చెందాయని బాధిత రైతు ఆరోపించారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



ప్రజాపక్షం/చంద్రుగొండ: రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైనా సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రుగొండ మండలం ఇందిరానగర్‌కు చెందిన ఓ వివాహ వేడుకలకు వెళ్లి తిరిగి ఇంటి(తిప్పనపల్లి)కి వచ్చే క్రమంలో ఆటో తిప్పనపల్లి ప్రధాన సెంటర్‌లో ఆగిఉన్న బొగ్గు టిప్పర్‌ను వెనుకభాగం నుండి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సయ్యద్ మైమూద్, ఎస్ యాకూబ్ పాషబీూ, బాబు, ఆఫిజ్‌లకు గాయాలవ్వడంతో 108 వాహనంలో కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆటో నుజ్జునుజ్జయింది. బొగ్గు టిప్పర్ రోడ్డు ప్రక్కన సక్రమంగా(వ్రాంగ్ పార్కింగ్ వల్ల)పెట్టకపోవడం వల్ల ప్రమాదం జరిగిందని బాధితుల కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. క్షతగాత్రులకు తలకు, నుదుటి పై బాగాన, కాళ్లు చేతులకు గాయాలైనాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

# కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

**-సింగరేణి సంస్థకు బాకీ ఉన్న రూ. 40 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలి**
**-ఈనెల 19న జాగృతి హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో సింగరేణి సంస్థ కార్పొరేట్ ఆఫీసు ముట్టడి**
**-తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**




**ప్రజాపక్షం/సత్తుపల్లిః** సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేసి, సింగరేణి సంస్థకు బకాయి ఉన్న రూ.40 వేల కోట్లను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. తెలంగాణ జాగృతి హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జనం బాట కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సత్తుపల్లి సింగరేణి బొగ్గు గనిని సోమవారం సందర్శించారు. అనంతరం కార్మికులనుద్దేశించి కవిత మాట్లాడుతూ ఈ నెల 19న తెలంగాణ జాగృతి హెచ్ ఎస్ ఆద్వర్యంలో సింగరేణి సంస్థ కార్పోరేట్ కార్యాలయ ముట్టడి కార్యాక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ప్రభుత్వం సింగరేణి సంస్థను కాపాడాలని, గత కెసిఆర్ ప్రభుత్వంలో సింగరేణిలో జరిగిన పలు మార్పులతో అనేక మంది యువత సింగరేణిలో ఉద్యోగాలు పొందారని, గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయటంలో విఫలమైందని, వెంటనే కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సింగరేణి ఉద్యోగుల సొంత ఇంటి కలను నెరవేర్చాలని, సింగరేణి ఉద్యోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మెడికల్ బోర్డు ఏర్పాటుతో పాటు, హైదరాబాద్ లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించి, కార్పొరేట్ వైద్యం అందించాలని కోరారు. సింగరేణి కార్మికులు ఇన్కమ్ టాక్స్ లను రద్దు చేయాలని సింగరేణి సంస్థ కు టెండర్ వేలం లేకుండా బొగ్గు గనుల బ్లాకులను కేటాయించాలన్నారు. సింగరేణి ఏరియాలో పిల్లల చదువులు నిమిత్తం కార్పొరేట్ పాఠశాలలు నెలకొల్పి విద్యను అందించాలని, సింగరేణికి లో ప్రస్తుతం ఉన్న ఏరియా ఆసుపత్రులను బలోపేతం చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండేళ్లలోనే సింగరేణి సంస్థకు రూ.40 వేల కోట్ల రూపాయలు పెండింగ్ పెట్టిందని వాటిని సంస్థకు జమ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ సమస్యలన్నిటి పైన రాష్ట్రవ్యాప్తంగా జనం బాట కార్యక్రమంలో భాగంగా పర్యటించి ఈనెల 19 న హైదరాబాదులో సింగరేణి సంస్థ కార్పొరేట్ ఆఫీసు ముట్టడి కార్యక్రమాన్ని జరపనున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం సత్తుపల్లి సింగరేణి జేవిఆర్ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహ్లాద్ తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి తెలంగాణ జాగృతి అధ్యక్షులు సాగర్, రియాజ్ అహ్మద్, హెచ్ ఎం ఎస్ జనరల్ సెక్రెటరీ, తిప్పారపు సారయ్య, వై.ఆంజనేయులు, కొత్తగూడెం ఏరియా ప్రెసిడెంట్, శ్రీలత, వి శ్రీనివాస్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్, ఎం.ఆనంద్, ఎండి ఆసిఫ్, ఎండి ఆజాద్ ఖాన్, హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి సంస్థ ఉద్యోగులు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డయాగ్నస్టిక్ హబ్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన డిఎంఅండ్‌హెచ్ఓ

**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగంః** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని డయాగ్నస్టిక్ హబ్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు, మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ ఎం నరేందర్‌తో కలిసి టి హబ్‌ను సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ల్యాబ్ మేనేజర్, ల్యాబ్ టెక్నిషియన్ల విధులను పర్యవేక్షించారు. ల్యాబోరేటరీ సేవల వేగాన్ని మరింత మెరుగుపరచాని, పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజలకు వేగంగా నిర్ధారణ రిపోర్టులను అందించాలని, ల్యాబ్ టెస్టుల కోసం వచ్చే పేషంట్లకు ఇబ్బందులు లేకుండా వాష్‌రూం, త్రాగునీరు, సిట్టింగ్ సదుపాయాలు కల్పించాలని, ల్యాబోరెటరీ పరిసరాలు ఇన్ఫెక్షన్ లేకుండా చూడాలని తెలిపారు. కెమిస్ట్రీ ఎనలైజర్‌కు చిన్న చిన్న సాంకేతిక లోపాలు ఏర్పడడం వల్ల ఈ రోజు టెక్నిషియన్ వచ్చి రిపేర్లు చేపడుతారని తెలిపారు. గవర్నమెంట్ జనరల్ హాస్పటల్‌లో ఉన్న సెంట్రల్ ల్యాబ్, ఎమర్జెన్సీల్యాబ్‌లో ఎమర్జెన్సీ పరీక్షల నిర్వహణ ఆలస్యం కాకుండా జరుగుతున్నాయని, క్లినికల్ బయోకెమిస్ట్రీ, క్లినికల్ పాథాలజీ, మైక్రో బయాలజీలకు సంబంధించిన దాదాపు 134 టెస్టులను నిర్విరామంగా నిర్వహిస్తున్నామని, జిల్లాలోని 26 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4 యూపిహెచ్‌సిలు, 9 బస్తీ దవాఖానలు, 7 కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల నుండి ప్రతి రోజు డయాగ్నస్టిక్ హబ్‌కు 1500ల నుండి 2 వేల వివిధ రకాల బ్లడ్ శాంపిల్స్ టెస్టులకు వస్తున్నాయని, 8 మంది ల్యాబ్ టెక్నిషియన్లు పరీక్షలు నిర్వహిస్తున్నారని, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బిందుశ్రీ, నోడల్ ఆఫీసర్ ల్యాబ్ మేనేజర్ డి బిందు భార్గవి అందుబాటులో ఉండి పర్యవేక్షణ చేస్తారని, మెడికల్ డయాగ్నస్టిక్‌కు సంబంధించి పరీక్షలు సేవలు ప్రజలకు వేగంగా, శాస్త్రీయంగా జరుగుతున్నాయని, ఇంకా అదనపు పరికరాలు, సదుపాయాల కోసం పై అధికారులకు వివరించడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి రామారావు తెలిపారు.




## యువ వికాసంపై విద్యార్థులకు అవగాహన సదస్సు




**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం విద్యార్థిని విద్యార్థులకు యువ వికాసం, రోడ్డు భద్రత, మొక్కలు నాటే కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ షేక్ షకీలా భాను ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిలర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు, టీజీవో సంఘం వెంకట పుల్లయ్య వారి తల్లిదండ్రుల వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో గౌరవ మర్యాదలతో జీవిస్తూ ఉండాలని, రోడ్డుపై వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, జాగ్రత్త ప్రతి ఒక్కరు బాధ్యత అని, ప్రతి ఒక్కరు ప్రతి ఒక్క మొక్కను నాటి మంచి వాతావరణానికి సహకరించాలని విద్యార్థులనుకోరారు. విద్యార్థులు తల్లి దండ్రుల యొక్క ఆశలు ఆశయాలు నెరవేర్చాలని కోరారు. మండలంలో ప్రతి విద్యార్థి ఆదర్శవంతంగా ఉండాలని కోరారు. ఉత్తమ ఫలితాలు సాధనకు ప్రతి విద్యార్థి మంచిగా చదివి లక్ష్యాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కిరణ్, వీరభద్రం, శ్రీరాములు, కళావతి, రమాదేవి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్‌లో మైనార్టీ గురుకుల విద్యార్థులు ప్రతిభ

**ప్రజాపక్షం/సత్తుపల్లిః** పట్టణంలోని పోస్టాఫీస్ రోడ్డులో గల మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్దులు అథ్లెటిక్స్ లో ప్రతిభ కనబర్చారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ గేమ్స్ లో సత్తుపల్లి మైనారిటీ గురుకుల కళాశాల విద్యార్థులు షేక్ షరీఫ్ (లాంగ్ జంప్) అండర్ 17 లో, బానోత్ సురేంద్ర బాబు (400 మీ) రన్నింగ్ అండర్ 14 లో, షేక్ అయాజ్ (చెస్) అండర్19 లో మంచి ప్రతిభ కనబరిచి ఎస్‌జిఎఫ్ సర్టిఫికెట్లు సాదించారు. విద్యార్దులను కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరామయ్య, పిఈటి మహర్షి, కళాశాల అధ్యాపకులు అభినందించారు.



## గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక మాసం వన సమారాధనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి సహపంక్తి భోజనం చేశారు. సంఘం సలహాదారులు అదాలత్ నరేందర్, వెంపటి వెంకటేశ్వర్లు, సంఘం అధ్యక్షులు వెంపటి ఉపేందర్ ఆధ్వర్యంలో నూతన పాలక వర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా నునావత్ కిషన్, కార్యదర్శిగా ఎస్‌కె జాని, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె పాషా, కత్రం శేషగిరి, కోశాధికారి ఆకుల సైదులు, ఎం. రామ్మూర్తి, జాయింట్ సెక్రటరీగా నర్సింహారావు, హన్మంతరావు లను ఎన్నుకున్నారు. అదేవిధంగా ఈసి మెంబర్లుగా వి. శ్రీను, దిలీప్, ఎ. శ్రీకాంత్, వెంకటేష్, కె. రమేష్, అంజి, ఫయాజ్ ఖాన్, అలీమ్ తదితరులను ఎన్నుకున్నారు.

## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని ఆదరణ ఫౌండేషన్, ఆర్కే ఫౌండేషన్ అనాధ వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు నవశకం ఆధ్వర్యంలో సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మధిర నవశకం ఇన్‌చార్జి మోదుగు కిరణ్, నవతరం వ్యవస్థాపక అధ్యక్షులు మేకల రమేష్ మాట్లాడుతూ చలికావడం కావటంతో వృద్ధాశ్రమాల్లోని వృద్ధులకు సేవా దృక్పథంతో దుప్పట్లను అందచేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోదుగు స్పందన, కొమ్ము శ్రీను, కోట జయరాజు, పోలే సుధాకర్, వేము రాములు, గుండ్ల రత్నబాబు, వేల్పుల పవన్, మాగి ముఖేష్, ఇరుగు పుల్లారారావు, ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ దోర్నాల రామకృష్ణ, ఆదరణ పౌండేషన్ చైర్మన్ నిస్సి హరిణి పాల్గొన్నారు.

## విజయవంతమైన ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాల్టీ పరిధి మడుపల్లి గ్రామంలో కేవిఆర్ జనరల్ అండ్ ఎమర్జెన్సీ హాస్పటల్ వారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. ప్రముఖ వైద్యులు డాక్టర్ కోట రాంబాబు, డాక్టర్ హర్షిత, డాకర్ పి.ఉమాశంకర్ వైద్య సేవలు అందించగా వివిధ సమస్యలతో బాధపడుతున్న మహిళలు, గర్భిణీస్త్రీలు, సాధారణ వ్యాధి గ్రస్తులు ఈ వైద్యశిబిరంలో పాల్గొని వైద్యసేవలు పొందారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కేవిఆర్ జనరల్ అండ్ ఎమర్జెన్సీ హాస్పటల్ నందు 24గంటలు అన్నిరకాల ఆరోగ్య సమస్యలకు వైద్యులు అందుబాటులో ఉంటున్నారని, వైద్య సేవలను పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శీలం వీరవెంకటరెడ్డి, వేల్పుల బుజ్జి, ఉమామహేశ్వర్‌రెడ్డి, కంభం శివకృష్ణ, విజయ్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## పలు కార్యక్రమాలకు హాజరైన లింగాల



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణ పరిధిలోని పలు కార్యక్రమాలకు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, మధిర నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి లింగాల కమల్ రాజు హాజయ్యారు. ముందుగా మాజీ శివాలయం కమిటీ చైర్మన్ వంకాయలపాటి నాగేశ్వరరావు మనవడు అన్నప్రసాన కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం యన్నం కోటేశ్వరరావు తండి యన్నం వెంకట్రావు దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు , మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, నాయకులు చావా వేణుబాబు, కోన నరేందర్‌రెడ్డి, ఆళ్ల నాగబాబు, డోకుపర్తి సత్యంబాబు, వైవి అప్పారావు, కటికల సత్యనారాయణరెడ్డి, కపిలవాయి జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా సామాగ్రి అందజేత



**ప్రజాపక్షం/ మధిర :** విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సాహం అందించే లక్ష్యంగా క్రీడా చేయూత, హైకేర్ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో మధిర మండల పరిధిలోని పది ప్రభుత్వ పాఠశాలలకు రూ.60వేలు విలువ చేసే క్రీడా సామాగ్రిని సోమవారం పంపిణీ చేశారు. వాలీబాల్ నెట్స్, వాలీబాల్స్, వాలీబాల్ పోల్స్ ఆయా పాఠశాలల పిఇటిలకు అందించారు. ఖమ్మం జిల్లా నుండి రాష్ట్రస్థాయికి ఎంపికైన ఖో ఖో జట్టు విద్యార్థులకు క్రీడా దుస్తులు అందచేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించటం, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికి తీయడమే ఈ పంపిణీ కార్యక్రమం ప్రధానుద్ధేశ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడా చేయూత అధ్యక్షులు అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, ఎంఇఓ వై.ప్రభాకర్, గూడూరు కోటిరెడ్డి, జంగా కోటిరెడ్డి, హైకేర్ హాస్పటల్ వైద్యులు డాక్టర్ నవీన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, హెచ్‌ఎంలు శ్రీహరి, శ్యామ్, ప్రమీలరాణి, ఎస్‌టిఎఫ్ జిల్లా కార్యదర్శి రామారావు, పిడి చిన్ని, రంజాన్, హర్షిత, అపర్ణ, చైతన్య, వీర రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల మేరకు అత్యధిక పరిహారం అందిస్తాం

## -రైతులతో చర్చించిన అదనపు కలెక్టర్




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : సీతారామ ఎత్తిపోతల పథకం సంబంధించి భూ సేకరణకు నిబంధనల మేరకు అత్యధిక పరిహారం అందిస్తామని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయలపల్లి గ్రామాల్లో సీతారామ ఎత్తిపోతల పథకం నిమిత్తం భూ సేకరణ పరిహారం రేటు నిర్ధారణకు సంబంధిత రైతులతో అదనపు కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయపల్లి గ్రామాల్లో సీతారామ ఎత్తిపోతల పథకం 13వ ప్యాకేజీ నిర్మాణంలో భాగంగా భూ సేకరణ చేయాల్సి ఉండగా భూ సర్వే నిర్వహించి అవార్డులు ప్రకటించామన్నారు. ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించామన్నారు. బాజు మల్లాయిగూడెం గ్రామంలో ఎకరానికి రూ. 2.70 లక్షలు ఉందని భూ సేకరణ చట్టం ప్రకారం రెండింతలు అనగా రూ. 5.40 లక్షలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం పెంచి రూ.10.80 లక్షలు చెల్లించాలని నిర్ణయించిందన్నారు. ఆర్బిట్రేషన్‌లో 12 శాతం వడ్డీ క్రింద రూ.64వేలు కలిపి మొత్తం రూ. 11.44 లక్షలు ఎకరాకు చెల్లించనున్నట్లు తెలిపారు. రేలకాయపల్లి గ్రామంలో ఎకరానికి రూ. 2.92 లక్షలు ఉందని భూ సేకరణ చట్టం ప్రకారం రెండింతలు అనగా రూ.5.85 లక్షలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం పెంచి రూ.11.70 లక్షలు చెల్లించాలని నిర్ణయించిందన్నారు. ఆర్బిట్రేషన్‌లో 12 శాతం వడ్డీ క్రింద రూ.70,390లు కలిపి మొత్తం రూ. 12,40,390 ఎకరాకు చెల్లించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చివరికి బాజు మల్లాయిగూడెం గ్రామ రైతులకు ఎకరానికి రూ. 15 లక్షలు, రేలకాయపల్లి గ్రామ రైతులకు ఎకరానికి రూ. 16 లక్షలు భూమికి పరిహారం అందుతుందన్నారు. భూమిలో ఉన్న వ్యవసాయ పంపు సెట్ల, చెట్లు, ఇతర నిర్మాణాలకు విడిగా పరిహారం అందిస్తామన్నారు. ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ ముందు నుంచి మూడేళ్ల వరకు లావాదేవీలు పరిశీలించి సరాసరి ధర నిర్ణయించడం జరిగిందన్నారు. భూముల్లో ఏమైనా పరికరాలకు, నిర్మాణాలకు పరిహారం మిస్సయితే దరఖాస్తు అందిస్తే మరోసారి పరిశీలించి పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో రైతులు మాట్లాడుతూ ఎకరానికి రూ. 35 లక్షల నుంచి రూ. 40 లక్షల చొప్పున పరిహారం ఇప్పించాలని, భూములను కోల్పోవడం వల్ల జీవనోపాధి కోల్పోతున్నామన్నారు. భూమిలో ఉన్న పైపులైన్, చెట్లు ఇతర పరికరాలు, డ్రిప్ సిస్టం వివరాలు సరిగ్గా నమోదు చేసి పరిహారం అందించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్డిసి ఎం. రాజేశ్వరి, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ శ్రీనివాసులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు బోధనా సామర్థ్యాలు పెంచుకోవాలి

ప్రజాపక్షం/భద్రాచలం : గిరిజన సంక్షేమశాఖ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పాఠ్యాంశాలకు చెందిన బోధనా సామర్థ్యాలను పెంచుకుని విద్యార్థులకు సరైన విద్యాబోధన చేయాలని గిరిజన సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అశోక్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఉపాధ్యాయ కళాశాల్లో ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణలో భాగంగా మొదటిరోజు ఆయన ముఖ్యాతిథిగా పాల్గొని శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుత గిరిజన విద్యార్థుల అభివృద్ధి కోసం ఐదు రోలు సామర్థ్య నిర్మాణ శిక్షణ ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణలో ఉపాధ్యాయులు సులభతరంగా పాఠ్యాంశాలు బోధించేందుకు దోహదపడతాయన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు సామాజిక స్పృహ, సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడానికి ఉపాధ్యాయులు ముందుండాలన్నారు. హెచ్‌ఎంలు పరిపాలన విభాగంలో మెలుకువలు, నాయకత్వ లక్షణాలు పెంపుదలకు, తరగతి గదిలో అభ్యాసన ప్రక్రియ ఎలా జరుగుతుందో పరిశీలించడానికి ఈ




శిక్షణ ఎంతో ఉపయోగ పడుతుందని చెప్పారు. హిందీ, ఇంగ్లీష్, తెలుగుభాషల్లో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో మొత్తం 180 మంది ఉపాధ్యాయులు, 12 మంది డిఆర్‌పిలు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఇడి కళాశాల ప్రిన్సిపల్ డా.వీరునాయక్, డిఎడ్ కాలేజీ ప్రిన్సిపాల్ భవాని, ఏసిఎంఓ రమేష్, ఎస్‌సిఆర్‌పిలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో పాలకుల విఫలం



ప్రజాపక్షం/కారేపల్లి: ఎన్నికలలో గట్టెక్కటానికి ఇచ్చిన హామీలు అమలు చేయటంలో పాలకులు విఫలమైనారని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావులు విమర్శించారు. సోమవారం కారేపల్లి మండల కమిటీ సమావేశం ఇస్మాయిల్ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో తాళ్లపల్లి కృష్ణ మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలుకు నోచుకోలేదని, కొన్ని హామీలు పాక్షికంగా అమలు చేసి పూర్తి అమలు చేసినట్లు ప్రకటించుకుంటున్నారని. రైతు రుణమాఫీ మధ్యలోనే ఆగిందని, రబీ సీజన్ బోనస్ వేయలేదని, రైతు భరోసాను ప్రభుత్వం భారంగా భావిస్తుందన్నారు. తుఫాన్‌తో చేతికి వచ్చిన పంటలు తుడిచిపెట్టుకపోయాయని, పత్తి రైతు దిక్కుతోచని స్థితిలో ఉన్నాదన్నారు. పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్రాలు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం విచారకమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేసి పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, మండల కార్యదర్శి కే నరేంద్ర, నాయకులు వజ్జా రామారావు, రేగళ్ల మంగయ్య, కే ఉమావతి, అజ్మీర శోభన్ బాబు, కేసగాని ఉపేందర్, పండగ కొండయ్య, లక్ష్మణ్, తేజావత్ చందర్, కొండల్ రావు, కరపటి సీతారాములు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# రామారావును హత్య చేసిన హంతకులను వెంటనే అరెస్టు చేయాలి




ప్రజాపక్షం/కూసుమంచి: సిపిఎం రాష్ట్ర నాయకులు, చింతకాని మండలం పాతర్లపాడు మాజీ సర్పంచ్ సామినేని రామారావు హత్య జరిగే నేటికి 18 రోజులు అవుతున్న పోలీసులు దోషులను తేల్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సామినేని రామారావు హత్య చేసిన హంతకులకు వెంటనే తేల్చాలని సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పద్మారెడ్డి భవనంలో జరిగిన సిపిఎం పార్టీ మండల కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ సామినేని రామారావు హత్య జరిగి 18 రోజులు అవుతున్న హంతకులను పట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. హంతకులను అరెస్టు చేసే వరకు పార్టీ ఆధ్వర్యంలో పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇది రాజకీయ హత్య అంటే పోలీసులు, కమిషనర్ ఏ మాత్రం సహించలేని పరిస్థితి కనిపిస్తుందన్నారు. హత్య వెనక పొలిటికల్ బ్యాగ్ గ్రౌండ్ ఉందనే ఎవరైనా ఉంటే వారిపైనే పోలీస్ కేసు నమోదు చేస్తామని సీపీ హెచ్చరించడం సరైన పద్ధతి కాదన్నారు. రామారావు సతీమణి స్వరాజ్యం ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. గ్రామానికి చెందిన ఐదుగురు హత్యలో ఉన్నారని స్వయాన పిటిషన్ ఇచ్చిన పోలీసులు పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. స్వరాజ్యం ఇచ్చిన ఫిర్యాదులో పేర్లు గల సభ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు మల్లెల సన్మతరావు, మండల కమిటీ సభ్యులు, గ్రామశాఖ కార్యదర్శులుపాల్గొన్నారు.

# గిరిజనులకు పథకాలు అందేలా కృషి చేయాలి



ప్రజాపక్షం/భద్రాచలం : అర్హులైన ప్రతీ ఒక్క గిరిజన కుటుంబానికి ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బారులో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనుల నుండి వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించిన ఆయన పరిష్కారం నిమిత్తం ఆయా శాఖల అధికారులకు పంపించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ పలు సమస్యలపై అందిన వినతులను పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ విడతలవారీగా అందుతాయని, ఇందులో ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్, గురుకులం ఆర్‌సిఓ అరుణకుమారి, ఏడిఎంహెచ్‌ఓ సైదులు, ఇఇ మధుకర్, ఏఓ సున్నం రాంబాబు, ఏపిఓ వేణు తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

## - పలు అంశాల్లో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జాతీయ 58వ గ్రంథాలయ వారోత్సవాలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నాల్గోరోజు విద్యార్థినీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా మహిళా కళాశాల తెలుగు అధ్యాపకురాలు స్వప్న హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగానికి చరవాణి ఉపయోగాలు, నష్టాలు, సీనియర్ విభాగానికి మదకద్రవ్యాలవినియోగం అనర్థాలు అనే అంశాలపై పోటీ జరిగింది. పలువురు విద్యార్థులు తమదైన శైలిలో అంశాలలో వక్తృత్వ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు గుమ్మడి మణిమృధుల, గ్రంథపాలకుడు మధుబాబు, వాణి, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు రశీదు ఇవ్వాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : రైతులు కొనుగోలు చేసే ప్రతీ వస్తువు కు డీలర్లు రశీదులు ఇవ్వాలని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు యం.సతీష్ సూచించారు. మండల కేంద్రం లోని రైతు వేదికలో సోమవారం డీలర్ల సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడారు. డీలర్లు రిజిష్టర్ నిర్వహణ ను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రతీ రోజు స్టాక్ వివరాలను నోటీస్ బోర్డుల పై ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. ప్రభుత్వం అనుమతి పొందిన విత్తనాలు, ఎరువులను మాత్రమే విక్రయించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి పై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి యం.రాధ, ఏఈవోలు అరవింద్, అవినాష్, దుర్గాభవాని, శిరీష, డీలర్ల సంఘం ప్రతినిధులు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, గెల్లా వెంకటేశ్వర్‌రావు, కె.వెంకట్ రెడ్డి, బి.రాముడు, కిరణ్ పాల్గొన్నారు. మండలంలోని మోటాపురం గ్రామంలో రైతులకు అవగాహాన సదస్సును నిర్వహించారు. మండలవ్యవసాయాధికారియం.రాధ,ఏఈవో, రైతులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం



ప్రజాపక్షం/చంద్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో రాజ్ మహమ్మద్ జాన్ బీ మెమోరియల్ ట్రస్ట్ సౌజన్యంలో రజాక్ అండ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో సోమవారం మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా తిప్పనపల్లి పంచాయితీలోని అహ్మద్ నగర్, వెంకటాపురం, తిప్పనపల్లి గ్రామాలకు చెందిన సుమారు 150 మంది రోగులను పరీక్షించి మందులను ఉచితంగా అందజేశారు. శస్త్ర చికిత్స అవసరమైన 15 మంది రోగులకు కంటి శస్త్ర చికిత్స చేసేందుకు వెంటనే తమ వాహనంలో ఖమ్మంలోని మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తరలించారు. వారికి ఉచితంగా శస్త్ర చికిత్స చేయనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా 2000రూపాయలు విలువ చేసే ఉచిత ఫ్యామిలీ ప్రివిలైజ్ కూపన్లను ఉచితంగా గ్రామస్తులకు అందించారు. ఈకార్యక్రమంలో ఎంపిటి పీకే ఎం ఖాన్, ఐఎన్‌టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, ట్రస్ట్ ఛైర్మన్ పాషా జునేద్, ఐఎన్‌టియుసి సభ్యులు కొమరయ్య, ఎస్‌కే గౌస్, సీతారామరాజు, మహేష్, రజాక్, వెంకటేశ్వర్లు, పంచాయితీ సెక్రటరీ సిహెచ్ శివ నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ ధరావత్ రామారావు, మచ్చా కుమార్, జాకీర్ హుస్సేన్, యాకూబాలి, ఆకుల రాంబాబు, హాస్పిటల్స్ సిబ్బంది దేవేందర్, పాషా, పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేశారు. సోమవారం ఖమ్మం నగరంలోని జీవన సంధ్య వృద్ధాశ్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. కల్పన సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమం లోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో ఏమైనా సమస్యలు, అవసరాలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు మందరపు శ్రీనివాసరావు, డా॥ పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

## -గోనె సంచులు అందుబాటులో ఉంచాలి : కూనంనేని





**ప్రజాపక్షం/పాల్వంచ :** రైతులకు గిట్టుబాటు ధర కావాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధి సోములగూడెం గ్రామంలో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. మండల పరిధి సోముల గూడెం గ్రామంలో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ ఆరుగాల కష్టించి పండించిన పంటను త్వరగా అమ్ముకోవాలనే ఆతృతతో దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని హెచ్చరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా సహకార సంఘాల ఆధ్వర్యంలో దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ప్రతిపాదిత గ్రామాలలో వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, కేంద్రాల సంఖ్యను పెంచాలని దీనితో రైతాంగానికి రవాణా ఖర్చులు తగ్గుతాయని అన్నారు. అధికారులు, సొసైటీ బాధ్యులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని ప్రభుత్వ కేంద్రాలలో విక్రయించి మద్దతు ధరతో పాటుగా బోనస్‌ను పొంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. రైతులు తీసుకొచ్చిన దాన్యాన్ని జాప్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేయాలని, గోనె సంచుల కొరత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు కావలసిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి శంభో శంకర్, సొసైటీ ఉపాధ్యక్షులు కాంపల్లి కనకేష్, తహశీల్దార్ దారా ప్రసాద్, ఎంపిడిఓ విజయ భాస్కర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా కమిటి సబ్యులు ఉప్పుశెట్టి రాహుల్, నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, రంజిత్, మాజీ జెడ్‌పిటిసి ఎర్రంశెట్టి ముత్తయ్య, మాజీ ఎంపిటిసి వీర మొహనరావు, మాజీ సర్పంచ్ భూక్యా విజయ్, కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి మహేష్, పంచాయితీరాజ్ ఏఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఏఈ,ఆర్ఐ నలీన్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ హాస్టల్‌ను పరిశీలించిన కవిత



**ప్రజాపక్షం/పెనుబల్లి:** మండల పరిధిలోని గల మోడల్ స్కూల్ హాస్టల్‌ను సోమవారం జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పరిశీలించారు. హాస్టల్ విద్యార్థులతో కాసేపు కూర్చొని మాట్లాడి, హాస్టల్‌లో ఉన్న సమస్యలు, సదుపాయాల పైన విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కవితకు హాస్టల్‌లో పడుతున్న సమస్యలపైన ఏకరువు పెట్టారు. కవిత మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామి ఇచ్చారు. తల్లిదండ్రులను వదిలిపెట్టి హాస్టల్‌లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న బాలికల పట్ల అధికారులు జాగ్రత్త వహించాలని ఆమె సూచించారు.

# కుమ్మరి శాలి వాహన కార్తీక వన సమారాధన



**ప్రజాపక్షం/వైరా:** వైరా, తల్లాడ కుమ్మర, శాలివాహన, ప్రజాపతి(కెఎస్‌పి) నిర్వహించిన కార్తీక వన సమారాధన కార్యక్రమానికి హాజరైన మొల్లమాంబ కుమ్మరి సంఘం గౌరవ అధ్యక్షులు చిలివేరు జనార్ధన్, జిల్లా అధ్యక్షులు మొగిలిచర్ల సైదులు, జిల్లా ప్రధాన కార్యదర్శి దరిపల్లి చంద్రశేఖర్, జిల్లా యూత్ అధ్యక్షులు దరిపల్లి వీరబాబు, కోశాధికారి చలిగంటి బిక్షమయ్య, కెఎస్‌పి మహిళా అధ్యక్షురాలు కొలిచలం గీత, కెఎస్‌పి కార్యనిర్వాహక సభ్యుడు కోడూరు కిరణ్, కొలిచలం బ్రహ్మయ్య, గౌరవ సలహాదారులు వేలాద్రి, మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ ఆచంట వరప్రసాద్, డిఈ కోడూరు లక్ష్మణరావు, కోడూరు వీరకృష్ణ, వన్నాపురం హరినాథ్, కార్యక్రమ నిరాహకులు గుమ్మడిదల వెంకటనారాయణ, సంగెపు వెంకటేశ్వరరావు, విలాసాగరం వెంకటేశ్వర్లు, దరిపల్లి మధు, సంగెపు కృష్ణ, నర్సింహారావు, విలాసాగరం నరేష్, దరిపల్లి శ్రీనివాసరావు, నారాయణ, శ్రీను, రామకృష్ణ, ప్రసాద్, గుడిమెట్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ నాల్గో వార్డులో పిసిసి ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ నివాసం నందు జరిగిన కార్తీక మాసం సత్యనారాయణ వ్రత కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు పెద్ద ఎత్తున వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు. నూతి సత్యనారాయణ, విజయరాణి దంపతులు శబరి, ప్రత్యూష దంపతులు, వంశీక్రిష్ణ, అర్చిత దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కూతురు, అల్లుడుతో పాటు వారి కుటుంబ సభ్యులకు వస్త్రాలను అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, ఇందుమతి దంపతులు, తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మాజీ మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, కట్టా కృష్ణార్జున్‌రావు, ముళ్ళపాటి సీతారాములు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, చెరుకూరి చలపతి, బాణాల వెంకటేశ్వర్లు, కొత్తా వెంకటేశ్వరరావు, శారద దంపతులు, మరికంటి శివ, డేడికుమారి దంపతులు, మద్దెల రవి, వేముల రత్నాకర్, పొదిలి హరినాథ్, కోసూరు శ్రీనివాసరావు, కామినేని శ్రీనివాసరావు, బత్తుల గీత శ్రీనివాసరావు దంపతులు, పల్లపు కొండలు తదితరులు పాల్గొన్నారు.

# వారోత్సవాల సందర్భంగా కవి సమ్మేళనం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కవి సమ్మేళనం, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కవి సమ్మేళనం, పలువురు కవులను సన్మానించారు. కవి సమ్మేళనంతో పాటు డా॥ బాబూరత్నాకర్ యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కవులు ఎలగందుల దేవయ్య, షేక్ షఫీ, పురుషోత్తం, విజయ్‌రాజు, రాజాప్రతాప్, లెనిన్ శ్రీనివాస్, నామ పురుషోత్తం, రాచమళ్ల ఉపేందర్, సీనియర్ పాత్రికేయులు శ్రీనివాస్ తదితరులు కవి సమ్మేళనంలో అలరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కరుణకుమారి, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెవిఎస్ఎల్ఎన్ రాజు, కార్యదర్శి ఇమామ్, ఉద్యోగులు భాస్కర్, లలితకుమారి, సుమలత, విజయకుమారి, నాగలక్ష్మి, రవిబాబు, భూక్యాబాబు, సిహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై ధైర్యంగా నిలదీయాలి : కవిత






**ప్రజాపక్షం/వైరా:** వైరాలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కూరగాయల మార్కెట్ నందు పర్యటించి వ్యాపారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ధైర్యంగా అడగాల్సిందే అడిగినప్పుడే సమస్య అనేది పరిష్కారం అవుతుంది. మనం అడగడం మరిచిపోతే ప్రభుత్వం మమ్మల్ని అడిగే వాళ్లు ఎవరు లేరని పట్టించుకోకుండా ఉండే పరిస్థితి ఉంటుంది. కాబట్టి సమస్యలను పరిష్కరించే దిశగా పోరాటం చేయాలి. జిల్లాలో రెండు రోజులు తిరిగి ఒక్కొక్క సమస్య మీద మాట్లాడడం జరుగుతుంది. జాగృతి సమస్యల పరిష్కారం బాటలో భాగంగా ఖమ్మం జిల్లాకు వచ్చిన ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు. ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అయిపోయింది. ఎక్కడ సమస్యలు అక్కడే మిగిలిపోయాయి. వాటిని పరిష్కరించే దిశగా పోరాటం చేస్తాం. వైరాలో కూరగాయల మార్కెట్ త్వరితగతిన పూర్తి చేయాలని, ఎమ్మెల్యేని డిమాండ్ చేస్తున్నాం. అదేవిధంగా ఇందిరమ్మ కాలనీ ముంపుకు గురికాకుండా కరాకట్ట నిర్మించాలని కోరుతున్నామని అన్నారు. భగీరథ కార్మికులను కొంతమందిని తొలగించారని, వారిని విధుల్లోకి తసీఉకోవాలి. పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే అందించాలని అన్నారు. వైరా రిజర్వాయర్‌కి అనుకున్న విధంగా ఎక్కడ నీరు రావడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డేవిడ్‌రాజ్, పలువురు జాగృతి కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాదయాత్రకు బిఆర్ఎస్ నేతలు సంఘీభావం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పట్ల చూపుతున్న నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి రాకేష్ చేపట్టిన పాదయాత్రకు బిఆర్ఎస్ నేతలు సంఘీభావం తెలిపారు. విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు సంబంధించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ఖమ్మం నుండి హైదరాబాద్ వరకు రాకేష్ చేపట్టిన పాదయాత్ర సోమవారం ఖమ్మం జెడ్పి సెంటర్‌లో ప్రారంభమైంది. ఈ పాదయాత్రకు ఎంఎల్‌సి, బిఆర్ఎస్ అధ్యక్షులు తాతా మధుసూదన్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర లు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కిన సందర్భాలు లేవన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో ప్రైవేటు విద్యా సంస్థలు పేద విద్యార్థులపై ఒత్తిడి తెస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్‌జెసి కృష్ణ, పగడాల నాగరాజు, బొమ్మ రాజేశ్వరరావు, బిచ్చాల తిరుమలరావు, డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, సద్దాం షేక్, మహ్మద్ రఫీ, షారూఖ్, వంశీ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్లకు చిక్కిన రైతు

## - రూ. 40 వేలు పోగొట్టుకొన్న బాధితుడు

**ప్రజాపక్షం/పాల్వంచ :** ఓరైతుకు రావలసిన డబ్బులను పంట కొనుగోలు చేసిన వ్యక్తి రైతు ఖాతాలోకి జమ చేశాడు. అనంతరం సైబర్ క్రైమ్ దొంగలు రైతు ఖాతా నుండి సుమారు 40 వేయిలను విత్‌డ్రా చేసుకొన్న సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. మండల పరిధి మల్లారం గ్రామానికి చెందిన రైతు భీమనబోయిన కొండలరావు మొక్కజొన్న పంటను ఓ వ్యాపారికి విక్రయించాడు. సదరు వ్యాపారి ఈ నెల 16వ, తేదీ ఉదయం పంటకు సంభంధించిన రూ. 40,000/ల నగదును రైతు ఖాతాలోకి జమచేశాడు. అనంతరం ఆయన సెల్ ఫోన్‌కి రెండు మెసేజ్‌లు వచ్చాయి. వీటిని ఓపెన్ చేశాడు. కాగా 17వ, తేదీ నగదును ఉపసంహరించుకొనేందుకు పాల్వంచలోని యూనియన్ బ్యాంకు వచ్చి డబ్బులు డ్రా చేయటానికి ప్రయత్నించగా ఖాతా ఖాళీ అయినట్లు తెలిసింది. వెంటనే బ్యాంకు సిబ్బందితో మాట్లాడగా 16వ, తేదీ మద్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు డ్రా చేసుకొన్నట్లుగా తెలిపారు. దీనితో బాదితుడు లబోదిబో అంటూ గ్రామీణ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశాడు.

# విద్యార్థినుల అదృశ్యం.. ములుగులో ప్రత్యక్షం

**ప్రజాపక్షం/పాల్వంచ :** పాత పాల్వంచ బాలికల గురుకుల పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమైన సంఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి పాల్వంచ మున్సిపాలిటి పాత పాల్వంచ జ్యోతీనగర్‌లో గల మహాత్మా జ్యోతీభాపూలే బాలికల గురుకుల పాఠశాలలో పాల్వంచ, కొత్తగూడెంలకు చెందిన 7వ, తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థినులు సోమవారం తెల్లవారు జామున పాఠశాల నుండి అదృశ్యమయ్యారు. పాల్వంచ నుండి కొత్తగూడెం వెళ్ళి ట్రైన్‌లో వరంగల్ వెళ్ళారు. అక్కడ నుండి ములుగులో ఉన్న వారి బందుల ఇంటికి చేరుకొన్నారు. బాలికలను చూసిన బందువులు సమాచారాన్ని వారి తల్లిదండ్రుల చేరవేశారు. దీనితో తీవ్ర ఆందోళనకు గురైన బాలికల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకొన్నారు. పాఠశాల వార్డెన్ నిర్లక్ష్యంతోనే జరిగిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అజాగ్రత్తగా, పట్టించుకోకుండా ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై పాఠశాల ప్రిన్సిపాల్ ను ఫోన్ ద్వారా వివరణ కోరటానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.